## క్లుప్తంగా

### నిధులు రికవరీ

పాల్వంచ: మండలంలో గత మూడేళ్లలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకున్న అవకతవకల్లో అధికారులు రూ.1,75,833 రికవరీకి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీ శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా 36 పంచాయతీల్లో రూ.25.5 కోట్ల నిధుల ఖర్చుపై ఆడిట్ చేయగా రికవరీతో పాటు రూ.76వేల జరిమానా విధించారు. 18 పంచాయతీలకు షోకాజ్ నోటీసులు అందించారు.

### కార్మికుల కష్టాలు తెలిసిన అధికారి ఆనందరావు



జీఎం పర్సనల్ ఆనందరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): తన పనితాసు చేసుకునే ఈ రోజుల్లో పక్క సెక్షన్ సమస్య అయినప్పటికీ కార్మికుల కష్టాలను తెలుసుకొని వాటి నివారణకై కృషి చేసే అధికారి, తెలంగాణ బిడ్డ అందెల ఆనందరావు అని అంబేడ్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల శివకుమార్ అన్నారు. శనివారం సింగరేణి జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) అందెల ఆనందరావు జన్మదిన వేడుకలు సింగరేణి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్ సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా శివకుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పర్సనల్ విభాగం అధికారులు, మాజీ హెల్త్ డైరెక్టర్ జూపాక రమేష్, సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ రంగాకిరణ్, సేవా సమితి అధ్యక్షురాలు మునీల పాల్గొన్నారు.

### వాలీబాల్ కిట్లు పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని పూసపల్లి గ్రామంలో పీఎస్ఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమకూర్చిన వాలీబాల్ కిట్లను స్థానిక యువతకు ఎంపీటీసీ పూనెం సురేందర్, ఉపసర్పంచ్ ఉండం రాకేష్, సూర్నపాక సత్యనారాయణ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుకు అధిక ప్రాధాన్యమిస్తూ ఖాళీ సమయాన్ని ఆటలకు కేటాయించాలని సూచించారు.

### ఎస్సీ, ఎస్టీ రైట్స్ సొసైటీ సెక్రటరీగా భిక్షపతి



ఇల్లెందు: అఖిల భారత ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇల్లెందుకు చెందిన గుగ్రం భిక్షపతిని నియమించారు. శనివారం ఇల్లెందులో భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మురళీధర్, రాచూరి చంద్రశేఖర్‌రావుల చేతుల మీదుగా ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల కోసం తన వంతు బాధ్యతతో కృషి చేస్తానన్నారు. తనకు పదవికి ఎంపిక చేసినరాష్ట్ర బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఏసీడీ పేరుతో అదనపు భారం మోపొద్దు

పాల్వంచ: ఏసీడీ పేరుతో ప్రజలపై అదనపు విద్యుత్ భారం మోపొద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్ల ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గూడెపూరి రాజు, వాడే లక్ష్మి, సతీష్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీను, పాషా, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

### వడ్డీ లేని రుణాలివ్వాలి

ఇల్లెందురూరల్: స్వయం సహాయక సంఘాలకు పాతరుణాలు రద్దు చేసి కొత్తగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని 21పిట్ ఏరియాలో శనివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంతోపాటు అభయహస్తం పునరుద్ధరించాలని, జనరక్ష, ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకాలను కొనసాగించాలని, శ్రీనిధి మహిళా బ్యాంకులను గ్రామస్థాయిలో ఏర్పాటు చేయాలని, సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్న భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గూళ్ల నాగయ్య, రమేష్, లాలు, వెంకన్న, నాగవేణి, రూప, సునిత, లక్ష్మికాంత, రజిత, కృష్ణవేణి, సుగుణ, అరుణ, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణం నందనవనం..

- ఇల్లెందులో ముమ్మరంగా అభివృద్ధి పనులు
- 10న మంత్రి కేటీఆర్ రాక



ఇల్లెందులో కళకళలాడుతున్న మెయిన్ రోడ్డు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో ప్రధాన రోడ్లకు మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే డివైడర్లలో మొక్కలు నాటడంతో పట్టణం సుందరంగా నందనవనంగా కళకళలాడుతోంది. 18 ఏళ్ల క్రితం ఆనాటి మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల కృషితో పట్టణంలోని మెయిన్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చారు. రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ హైమ్యాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో నిధులు లేక ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో విస్తరించ లేదు. ప్రస్తుతం ఈ రోడ్డును నేషనల్ హైవేకు బదలాయించడంతో ఈ రహదారికి మహర్దశ పట్టింది. మిషన్ భగీరథ పైపులైన్ కోసం రోడ్లన్నీ తవ్వారు. కరెంటాఫీస్ నుంచి మహబూబాబాద్ రోడ్డు వరకు సుమారు 4 కిలోమీటర్ల దూరం వరకు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో మరమ్మతు చేపడుతున్నారు. వారం రోజుల క్రితం జగదాంబా సెంటర్‌లో ఎమ్మెల్యే హరిప్రియ ఈ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్విన సీసీ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు సీసీ మీద బీటీ పనులు కూడా సాగుతున్నాయి. ఈ నెల 10న ఇల్లెందుకు మంత్రి కేటీఆర్ రాక.. సందర్భంగా పనులు వేగం చేశారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు గోవింద్ సెంటర్ నుంచి శిల్పా ఎలక్ట్రానిక్స్ వరకు సీసీ, జగదాంబా సెంటర్ నుంచి కరెంటాఫీస్ వరకు బీటీ రోడ్డు ఉంది. అదేవిధంగా గోవింద్ సెంటర్ నుంచి మహబూబాబాద్ క్రాస్ రోడ్ వరకు బీటీ రోడ్డుఉంది. అయితే రోడ్డు చివరి భాగం నుంచి ఇరువైపులా డ్రెయినేజీ నుంచి రెండు మీటర్ల మేర మట్టి రోడ్డు ఉంది. దీనిని కూడా సీసీ, బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నారు. మట్టి రోడ్డు కావటం వల్ల వాహనం తొలిగే క్రమంలో రోడ్డు దిగాల్సి వస్తోంది. దీంతో దుమ్ము, ధూళి షాపుల్లోకి చేరుతోంది. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో బొగ్గు, ఇసుక లారీలు ప్రయాణిస్తుంటాయి. దీనికి పరిష్కారంగా అంతటా బీటీ రోడ్డు పనులు సాగుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్‌హెచ్‌పై తొలగని సందిగ్ధం..**

మహబూబాబాద్ నుంచి కొత్తగూడెం వరకు వయా ఇల్లెందు మీదుగా ఎన్‌హెచ్ రోడ్డు పరిధిలోకి వెళ్లింది. అయితే ఎన్‌హెచ్ రోడ్ విస్తరణలో పట్టణాల్లో నూటికి నూరుశాతం బైపాస్ రోడ్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

ఇల్లెందు పట్టణంలో కూడా బైపాస్ ఉంటుందని చెబుతున్నారు. బైపాస్ రోడ్డు ఎటునుంచో స్పష్టత రానప్పటికీ పట్టణంలో ప్రధాన రోడ్డుకు మాత్రం మరమ్మత్తులు చేస్తున్నారు.

### పట్టణానికి కళ వచ్చింది



ఎన్నో ఏళ్లుగా పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకంగా ఉండేది. మిషన్ భగీరథ పైపులైన్ కోసం రోడ్లనీ తవ్వి వదిలేశారు. వారంరోజులుగా మెయిన్‌రోడ్డుకు మరమ్మతులు చేసి బీటీ రోడ్డుగా మారుస్తున్నారు. దీంతో పట్టణానికి కళ వచ్చింది. పట్టణంలో అంతర్గత రోడ్లకు కూడా మరమ్మతులు చేయాలి.

– బెడదం నవీన్, నంబర్–2 బస్తీ, ఇల్లెందు

### ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



తమ పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన మెయిన్ రోడ్డు మరమ్మతులు, సీసీ, బీటీ రోడ్లు కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ కృషితో ఎట్టకేలకు ప్రధాన రహదారి సుందరంగా మారుతోంది. దీనివల్ల పట్టణం నందనవనంగా మారుతుంది.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపాల్టీ చైర్మన్, ఇల్లెందు

### మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం



నేషనల్ హైవే మరమ్మతు, విస్తరణ పనులకు రూ. 40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రధాన రహదారి గుంతలమయంగా మారటంతో ప్రమాదాలు జరుగుతన్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఈ రోడ్డు బాగు చేయించాలని విశ్వప్రయత్నం చేశాను. ఇప్పటికి నా కల నెరవేరుతోంది. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం.

– హరిప్రియ, ఎమ్మెల్యే, ఇల్లెందు

# శాంతిభద్రతలను కాపాడండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

జూలూరుపాడు: శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై పోటు గణేష్‌తో స్టేషన్‌కు సంబంధించిన పలు విషయాలను చర్చించారు. మాట్లాడుతూ.. ప్రజలు సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తాము జర్నలిస్టులను మిత్రులుగానే భావిస్తామని, ప్రశాంత వాతావరణంలో కలిసి పని చేయాల్సిన అవసరం అందరి ఉద్దేశం అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, దొంగతనాలు, బాల్యవివాహాలు, మహిళలపై అకృత్యాలు తదితర మోసాలను అరికట్టడానికి అందరం కలిసి పనిచేస్తే మంచి సమాజానికి బాట వేసిన వారం అవుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై పోటు గణేష్, ఏఎస్ఐ మధులత, స్టేషన్ రైటర్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మరింత బడ్జెట్‌ను కేటాయించాలని అఖిల బారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాలోత్ కృష్ణ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాపితంగా వ్యవసాయ, ఉపాధి కూలీలు పోరాటం చేస్తే కేంద్ర ప్రభుత్వం ఆనాడు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కూలీలకు ఎంతో ఆసరాగా ఉన్న ఈ పథకానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి పథకాన్ని తీసివేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కూలీలకు చెల్లింపులు చేయకుండా గతం కంటే బడ్జెట్ తగ్గించి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా పెద్దమొత్తం బడ్జెట్ కేటాయించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, మండ్రాజుల కృష్ణ, వీరభద్రం, బాబూరావు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2 లక్షల 75 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాతోట్ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆజాద్, రాజశేఖర్, ఆదిలక్ష్మి, బాడిష పాపారావు, వెలగల నర్సింహారావు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, పాల్వంచ కన్వీనర్ కె.సత్య మాట్లాడుతూ.. ఆటో, ట్రాలీ డీసీఎం, లారీ, ట్రాక్టరు, కారు తదితర రంగాలలో ట్రాన్స్‌పోర్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మంది ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఉన్నారని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో వివిధ రంగాలలో కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరిపై అధిక లోడ్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు అధిక చలానాలు, వేధింపులు పెరిగినట్లు చెప్పారు. ఒకవైపు ప్రైవేట్ ఫైనాన్స్‌ల వేధింపులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి మరోవైపు సతమతమవుతుండగా తాజాగా ట్రాఫిక్ పోలీసుల వేధింపులు పెరిగాయని వాపోయారు. కార్యక్రమంలో భూక్యా రమేష్, రాంబాబు, శివ, శివప్రసాద్, శ్రీను, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీసీసీ హమాలీలపై పనిభారం తగ్గించాలి



జీసీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సివిల్ సప్లై జీసీసీ గోదావలో హమాలీలు నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్నారని, వారికి పనిభారం తగ్గించాలని, ఐదు టన్నుల కాంటా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, కె.సత్య అన్నారు. శనివారం జిల్లా సివిల్ సప్లై డీఎం శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదాముకు వచ్చిన రేషన్ బియ్యం ఎగుమతి, దిగుమతి చేస్తూ కాంటాపై వేసి మళ్లీ గోదాములోకి నెట్టుకోవాల్సి వస్తోందన్నారు. హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, జిల్లా అధ్యక్షులు మొగిలి, బాబురావు, భిక్షం, లింగయ్య, ఉప్పలయ్య, సుబ్బారావు, శ్రీను, సత్యం, శ్రీను, సారయ్య, కొమరయ్య, సదానందం పాల్గొన్నారు.

### ఉచితంగా దరఖాస్తు.. మోడల్ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలకు నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో ఈనెల 8వ తేదీ వరకు ఉచితంగా అప్లికేషన్స్, ప్రతిరోజూ సాయంత్రం మోడల్ పరీక్షలు కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని నవత బుక్ స్టాల్, బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9396401400 నంబరులో సంప్రదించాలని కోరారు.

### హామీలు అమలు చేయాలి

పాల్వంచ: గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. జగన్నాథపురంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన బంధువు సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున సెలవుదినంగా ప్రకటించాలని, పోడు భూములకు శాశ్వత పరిష్కారం ఇవ్వాలని, జీఓ నంబర్ 3 యథాతదంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6న చేపట్టే దీక్షను విజయవంతం చేయాలని పిలుపుఇచ్చారు. బాదావత్ శ్రీను నాయక్, నాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

టేకులపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 6న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ఒక్క రోజు నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణోతు నాగరాజు, తేజావత్ రవి, సోమ్లా నాయక్, అశోక్, సంజీవ్, మనోహర్, అరవింద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### 6వ బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ పంచాయతీలోని 6వ బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో వీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డీసీహెచ్ రవిబాబునాయక్, డాక్టర్ బాబూరావు, డాక్టర్ సుగుణ, డాక్టర్ శంకర్‌లు బెటాలియన్ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. బెటాలియన్ పరిసర ప్రాంత ప్రజలకు సైతం వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బి.సీతారాం, టి.కాశీదాసు, ఈ.వీరన్న, డాక్టర్లు శైలేష్, నర్మద తదితరులు ఉన్నారు.

# కేన్సర్ రహిత సమాజానికి కృషి చేద్దాం



కొత్తగూడెంటౌన్: మాట్లాడుతున్న జడ్జి నీరజ



ఇల్లెందు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లారెడ్డి

కొత్తగూడెంటౌన్: కేన్సర్ రహిత సమాజం కోసం పాటు పడాలని కొత్తగూడెం అదనపు సివిల్ జడ్జి ఆడెపు నీరజ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగూడెం లీగల్ సర్వీసెస్ ఆథారిటీస్ ఆధ్వర్యంలో ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. కేన్సర్ కారక కణాలు కొద్దికొద్దిగా అభివృద్ధి చెంది శరీరం అంతా వ్యాప్తి చెందుతాయని, కేన్సర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలని చెప్పారు. అనుబ్రోలు రాంప్రసాదరావు, తోట మల్లేశ్వరావు, మెండు రాజమల్లు, సీనియర్ న్యాయవాదులు గాజుల రామ్మూర్తి పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: సరైన ఆహారం తీసుకుంటూ, వైద్యుల సలహాలను పాటిస్తూ, కేన్సర్‌ను జయించవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్, సుగుణారావు, షేక్ దస్తగిరిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వైద్య ప్రచారకులు డాక్టర్ బి.కృష్ణయ్య, మొక్కల వెంకటయ్య, గుండపునేని సతీష్, మహమ్మద్ గౌస్, వెంకట్, గణితి కోటేశ్వరరావు, రాజేష్, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ప్రపంచంలో అత్యధికంగా జరుగుతున్న రోగాల మరణాలకు కారణం కేన్సర్ ఒకటని సింగరేణి వైద్యులు డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం ఇల్లెందు సింగరేణి వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అన్నారు. కేన్సర్ చాలా కుటుంబాలలో చీకటి నింపుతోందన్నారు. దీనిని గుర్తించకపోతే ప్రమాదకారిగా మారుతుందని చెప్పారు. కేన్సర్ రోగం కంటే ఆరోగ్యం కల్పించే భయమే మనిషిని కుంగదీస్తుందన్నారు. కేన్సర్‌పై అవగాహన పెంచటానికి నివారణ గుర్తింపు ముఖ్యమన్నారు. సింగరేణిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 100వ వారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని ఏరియా జీఎం షాలేము రాజు ఆదేశాల మేరకు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వరూపరాణి, స్టాఫ్ నర్సులు సౌభాగ్యవేణి, ఉద్యోగులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం

పాల్వంచ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, ప్రైవేట్ బడా, బహుళ జాతి విద్యాసంస్థలతో కుమ్మక్కై, విదేశీ విద్యా సంస్థలను దేశాన్ని, రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం, దేశ జీడీపీలో 10శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని, విద్యా ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. విద్యార్థులకు స్కాలర్ షిప్, రీయంబర్స్‌మెంట్ తీవ్ర జాప్యం జరుగుతుంతోదన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.

పట్టణ అధ్యక్షుడిగా జహంగీర్, కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా రమ్య, శ్రావణి 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నవీన్, నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దిండిగల రాజేందర్

ఇల్లెందురూరల్: ప్రభుత్వ ఆస్పత్రులలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు. మండలంలోని కొమరారం గ్రామ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపర్చే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాలలోనూ వైద్యుల నియామక ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. వైద్యశిబిరంలో వివిధ విభాగాల్లో పది మంది వైద్యనిపుణులు సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాళి కృష్ణవేణి, బానోత్ సంతు, శ్రీనివాస్, మోకాళ్ల కృష్ణ, ఎంపీటీసీలు అజ్మీర బిచ్చా, బానోత్ రోజా, విద్యావంతుల వేదిక నేత రమేష్, కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్ఎల్ఎం బృందం పర్యటన

టేకులపల్లి: నేషనల్ లెవెల్ మానిటరింగ్ బృందం మండలంలో రెండు రోజుల పర్యటన ముగిసింది. శుక్రవారం సులానగర్, బొమ్మనపల్లి పంచాయతీల్లో పర్యటించిన బృందం శనివారం బద్దుతండా, బోడు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. నర్సరీ, డంపింగ్ షెడ్, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, ఉపాధి హామీ పనులు, స్వయం సహాయక సంఘాల తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరు, అమలు తదితర అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం ప్రతినిధి నాగరాజు, ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు, ఎంపీపీ భూక్యా రాధ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, భూక్యా చిన్ని, కార్యదర్శి బాలకృష్ణ , మహేందర్, ఈసీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందురూరల్: విద్యుత్ బిల్లుల్లో ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు శనివారం మండలంలోని సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ మీటరు ఉన్న ప్రతిఒక్కరికీ ఏసీడీ చార్జీల పేరుతో అదనపు బిల్లులు వసూలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటోందని విమర్శించారు. 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని మాయమాటలు చెబుతూ తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అంటూ కబుర్లు చెప్పిన ప్రభుత్వం నేడు కనీసం ఆరుగంటలైనా సరఫరా చేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఏసీడీ చార్జీలు రద్దు చేయడంతోపాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు, తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి ప్రవంతి, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, వల్లాల రాజయ్య, ధన్‌సింగ్, ఫకృద్దీన్, గడదాసు వెంకటేశ్వర్లు, పూనెం శ్రీరాములు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్

### ఏళ్ల తరబడి ఎదురు చూపులు..

టేకులపల్లి మండలం సులానగర్ నుంచి చింతలంక గ్రామానికి వెళ్లే రహదారికి మోక్షం లభించడం లేదు. దశాబ్దాలుగా స్థానికులు పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం లేదు. పక్కా రోడ్డు లేకపోవడంతో ప్రధానంగా వర్షాకాలంలో చింతలంక గ్రామానికి, పంట పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ, పీఆర్ టేకులపల్లి

సెల్ నంబర్ : 9676029621